మరికొద్దిసేపు అందరూ స్థాణువుల్లా వాకిట నిలబడి, చివరకు తలుపులువేసి మేడమీదికి వచ్చారు. భారతి కిటికీతలుపులు తెరిచి తన దృష్టిపోగలిగినంత వరకూ వీధికేసి చూస్తూ నిలబడింది. ఆమె పక్కనే తతిమ్మావాళ్లు నిలబడ్డారు. ఒక భయంకరమైన ఉరుముతోపాటు, దూరంగా ఎక్కడో పిడుగుపడి పెద్దమెరుపొకటి మెరిసింది. దాని వెలుగులో అందరూ ఆఖరిసారిగా డాక్టరుబాబును తృటికాలం చూడగలిగారు. డాక్టరుబాబు రాజమార్గంనుంచి పక్కకుపోయి దక్షిణంగా వున్న మైదానంకేసి నడుస్తున్నాడు. ఆయన వీపుమీదవున్న పెద్దమూట గాలితాకిడికి అటూయిటూ వూగుతున్నది. హీరాసింగ్ పెద్ద తలపాగాతో తుఫానుగాలికి వూగిపోతూ ఆయన వెనకగా నడుస్తున్నాడు.

“కష్టసమయాల్లో నన్నాదుకుని, చేదోడువాదోడుగావున్న ఓ మిత్రమా, నీకు నా హృదయపూర్వక నమస్కారాలు!” అన్నాడు శశిబాబు చెమ్మగిలినకళ్ళతో.

అపూర్వబాబు రెండుచేతులూ ఎత్తి జోడించి హీరాసింగ్‌కు నమస్కారం చేసి, ఒక నిట్టూర్పు విడిచాడు.

భారతిమాత్రం స్థాణువులా కిటికీదగ్గిరే నిలబడిపోయింది. శశిబాబు మాటలు ఆమెకు వినిపించలేదు. తనలాగే పక్కనవున్న మరొక స్త్రీకళ్ళనుంచి కూడా అశ్రువులు సంతతధారగా ప్రవహిస్తూండటం గమనించలేదు.





# నాగరికత నడుస్తోంది

శివరాజు సుబ్బలక్ష్మి

ఆ వూరు పల్లే అయినా పట్నంవాసన బాగా జీర్ణం చేసుకుంది. జడ అల్లుకున్నట్టు తారురోడ్డు వూరు మధ్యనుంచి మలుపు తిరిగింది. రోడ్డుకి రెండు పక్కలా నాగమల్లి చెట్లు చాలా దూరం నించి సైన్యంలా నిలబడి, వయ్యారంగా గాలికి కదిలి నీడల్ని తిప్పుతున్నాయి. ఇళ్ళు కూడా బారుల్లా వరసగా తీర్చినట్టు కనబడుతున్నాయి. కళ్లాపు చల్లిన వాకిళ్ళకి సున్నపుగీటులే శోభనియిస్తున్నాయి. వూరి బావిచుట్టూ పొద్దుటే ఎవరో వూడ్చి కడగటం తను ఈ మూడు వేకువల్నించీ చూస్తున్నాడు.

అసలు తనెప్పుడూ పల్లెలను చూడలేదు. ప్రశాంతంగా గడపాలన్న కోరికతోనే ఆ వూరికి వచ్చాడు. బాబ్జీ బొంబాయిలో పుట్టి అక్కడే పెరిగి అక్కడే పనిలో చేరాడు. పెద్ద పదవులు కాకపోయినా తనయింట్లో అంతా పనులు చేస్తున్నారు. తన తల్లికి దాదర్‌లో వుద్యోగం. అక్కలు ఇద్దరూ నర్సులే. అన్నగారు టాక్సీ అద్దెకి తిప్పుతున్నాడు. ఒదినగారు సినిమాహాల్లో వుంటుంది. అందరూ ఒకే చోట వున్నా, కలుసుకొని కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయటం అసలు జరగదు. అందరిదీ

తలో వేళా. తన తల్లి అసలు భోజనం అంటూ యే ఆదివారమో అన్నీ చేస్తుంది. అదీ తనకి మనసు కుదిరితే. మిగిలిన రోజులు ఎవరికి ఎక్కడ వీలో, అక్కడ ఏ రొట్టో తిని టీ తాగటం అందరికీ అదే అలవాటైంది.

ఈ పల్లెలో అలాక్కాదు. ఈ పల్లె చాలా చిత్రంగా వుంది. పొద్దున్నే ఎంతో సేపు ఇంటి చుట్టూ తుడిచేందుకే సరిపోతుందల్లె వుంది. ఈ ఇళ్ళవాళ్ళకి. పగలు మళ్ళీ గుడిసెల్లో సందడి వుండదు. పొద్దు గుంకేముందు, పొయ్యి వెలుగుతో మిణుకు మిణుకు మనే దీపాల కాంతి చిత్రంగా ముందు వాకిలికి నీడల్ని జల్లినట్టు కదులుతూ ఆడుతుంది. వాటిని చూస్తూంటే ఏదో సినిమా చూసినంత హాయిగా వుంది. మళ్ళీ ఎనిమిదయ్యేసరికి వూరు సందడి తగ్గి నిద్దరోతుంది.

అదేమి చిత్రమో, తన స్నేహితుడికి ఇట్లాంటి వాతావరణం అసలు గిట్టదుట. రామం, వచ్చిన మర్నాడే విశాఖపట్నానికి ప్రయాణం కట్టాడు. బాబ్జీ రానని వుండిపోయాడు. పల్లెల్లో ఎక్కువకాలం తిండికే సరిపోతుంది. వుదయాన్నే టిఫినూ, కాఫీలు. మధ్యాన్నం విస్తరి నిండా యెన్నో వుంటాయి. మళ్ళా నాలుగు కొట్టేసరికి చిరుతిండి. ఇంకా తిన్నది అరగక మునుపే. దీపాలు పెట్టంగానే విస్తళ్ళ రెపరెపలు.

రామం ఇంటివాళ్ళకి కూడా ఎనిమిది కాకుండానే తలుపులు వేసుకోవటం అలవాటు. బాబ్జీకి అది అట్టే నచ్చలేదు. ఒక వారం హాయిగానే గడిచింది. ఎందరివో బొమ్మలు గీశాడు. అంతా అతని చుట్టూ మూగి చిత్రంగా చూసేవారు. అమ్మాయిలు మరీ చనువుగా దగ్గరికి చేరి వయ్యారాలు ఒలకబోసేవారు. వీళ్ళకి తగువులూ, కక్షలూ, కార్పణ్యాలూ వుండవేమో, ఎంత మంచి వాళ్ళూ అనుకుంటూ వూహాల్ని పెంచుకు, ఆ వూరికి ఓ ఆకృతిని వూహించుకుని మురిసిపోయాడు. ఆ వూరిని వదిలి వెళ్ళుతూంటే కళ్ళు చెమ్మగిల్లాయి.

రామానికి ప్రయాణం అంటే ఎంతో ఆనందంగా వుంది. అసలు బాధ పడాల్సింది అతనూ! వాళ్ళ వాళ్ళని విడిచి దూరమౌతున్నానన్న జిజ్ఞాసే కనబడలేదు. ఏమో, ఎవరి భావాలు వాళ్ళవి అనుకుని తృప్తిపడి వూరుకున్నాడు బాబ్జీ. రైలు కదిలింది.

'హమ్మయ్య ఈ సారి గండం తప్పింది—' అంటూ పగలబడి నవ్వుకున్నాడు రామం. బాబ్జీ ఏమిటి అని అడగలేదు. రైలుకి ఇటూ అటూ వీడ్కోలు యిచ్చే చెట్లబారుని చూస్తున్నాడు. వాటి మధ్య అందంగా అస్తమించే సూర్యుణ్ని మళ్ళీ తను బొంబాయిలో ఫాక్టరీల పొగల మధ్య







చూస్తాడు. ఇద్దరు సూర్యులూ ఒకటే అయినా ఎంత తేడా! ఈ వాతావరణంలో, ఫ్రేమ్‌లో బిగించినట్లు వున్నాడు సూర్యుడు. అక్కడ పొగతో వేడి యెక్కి నల్లబడి మరుగుపడిపోతాడు.

రామం, బాబ్జీ భుజం పట్టుకు కుదుపుతూ "ఏమిట్రా నీ భావాలు! ఈ పొలిమేరకే వదిలిపెట్టు. మళ్ళీ మామూలు మనిషివి కా"— అని నవ్వుతున్నాడు.

ప్రయాణంలో కొన్ని పుస్తకాలు మళ్ళీ పట్నం పరిసరాలకి చేర్చాయి. ఎవరి డ్యూటీలు వాళ్ళవి. వారం అంతా మిషనులాగే తిరుగుతుంది. ఆదివారం కోసం బతికే ప్రజలు, పొద్దుఎక్కలేచి సోమరిగా గడిపి, అతిథులతో అలిసి, నిద్దరోయి ఆ హాయిని కాస్తా పాడు చేసుకుంటారు. ఒక గదీ, వరండాలో పదిమంది మసులుతూంటారు. ఈగల్లా జనం, నేలఈనినట్లు కార్లూ మనుష్యులూ కలిసి క్రిక్కిరిసిన రోడ్లూ ఏక్సిడెంట్లూ ఏడ్పులూ, అన్నీ మామూలే.

బాబ్జీకి ఈవెనింగ్ కాలేజిలో సీటు దొరకటంతో, పగలు పనీ రాత్రి చదువూ అయింది. రామంతో కలసి తిరిగేందుకు వీలు కావటమే లేదు. రామం తనకోసం వచ్చి పోయినట్టు ఎప్పుడైనా, అక్కో, అమ్మో చెబితే వూకొడ్తూనే చదువులో పడిపోతాడు.

ఒక రోజు బాబ్జీ తల్లి రహస్యంగా బాబ్జీని 'రామం ఎల్లాంటివాడు?' అని అడిగింది.

మొదట అర్థంకాక 'మనిషి లాంటి వాడు!' అని నవ్వాడు.

"మొద్దూ, అది కాదురా. నీకు దేవుడు తెలివి యిచ్చేడు కాని చురుకు ఇవ్వలేదు. ఏదైనా చూడగానే గ్రహించాలి. నీకు ఏ కోశానా ఆకళింపు లేదు" అని విసుక్కుంటూ వెళ్ళిపోయింది. మళ్ళీ

తల్లిమాటల్ని వల్లెవేసుకుంటూ ఆకళింపుకి అర్థం అడగాలి అనుకుంటూ నిద్రపోయాడు.

కొన్ని వారాలు ఏ ఆరాలూ లేకుండా జరిగిపోయేయి ... తల్లి ఆ రోజు అలిసినట్టు వుంది. చిరాగ్గా బాబ్జీ కోసం మెట్లపైనే కూర్చుంది. మామూలుగానే విజిలేసుకుంటూ, జుత్తు ముందుకివేసుకు, పుస్తకాల్ని తిప్పుకుంటూ బాబ్జీ పొద్దుపోయివచ్చాడు. తల్లి గద్దించినట్లు 'ఆగు' అంది. బ్రేక్ వేసినట్టు ఆగి వెనక్కి చూశాడు. తల్లి రోడ్డు మీదికి నడుస్తోంది. వెనకే 'ఏమిటి?' అంటూ బాబ్జీ వెళ్లాడు. పిల్లిలా పార్కుదాకా వెళ్ళి కూలబడింది. దూరంగా, మెరిసే లైట్లలో ఇంద్రభవనంలాంటి ఇంటికేసి చూస్తూ — "అదేరా, అప్పుడడిగానే—ఆ రామం విషయం చెప్పు." అంది.

"చెప్పేందుకుఏముందీ? ఓపల్లెనుంచి వొచ్చి యిక్కడ పనిచేస్తున్నాడు. అంతే తెలుసు. నాకింకో ఫ్రెండున్నాడు. అతనికి తను చుట్టం, వాడికి బదిలీ అయినప్పటినుంచీ ఇతనితో దోస్తీ ఎక్కువయింది. అంతే. ఆ మధ్య రమ్మంటే వాళ్ళ వూరేగా వెళ్లాను. వూరికే బాగానే వుంది. ఇంట్లో ఆడామగా బాగానే వున్నారు. తండ్రి ముసలాయన ఎప్పుడూ అరుస్తూ వుంటాడు. అంతే తెలుసు నాకు...అయినా అసలతని విషయంలో అంత ఆలోచన దేనికి?" అడిగాడు బాబ్జీ.

"అవసరం వచ్చే కదరా అడుగుతూంటా!" అని విసుక్కుని, మనసులోనిమాట బైటపెట్టడానికి ఇష్టంలేకనేమో, వూరుకుంది.

తల్లిపక్కనే కూర్చొని సినిమాకథ చెప్పేందుకు ప్రయత్నించి, తల్లి వినే ధోరణిలో లేకపోవటంతో వూరుకున్నాడు బాబ్జీ

"ఓ వారం లీవు తీసుకో. రామానికి తెలియకుండా ఆ వూరికి వెళ్ళాలి..." అంటూ తల్లి ఇంటిమొహం పట్టింది

బాబ్జీకి ఆ వూరికి మళ్ళీ వెళ్ళాలంటే ఇష్టంగానే వుండటంతో బయలుదేరాడు. కాని, రామం ఇంటికి రామానికి తెలియకుండా ఏమిటి? రామాన్ని కలుసుకునేందుకు వెళ్ళాడు. అతను అప్పుడే బైటికి వెళ్ళాడుట. అతన్ని కలవకుండానే వచ్చేశాడు బాబ్జీ మరునాడు— తల్లితో ప్రయాణం. అసలు ఎందుకో చెప్పదేం? అడిగితే— నువ్వు చూస్తూవుండు అని కసిరింది. సరే— వూరికి రమ్మంది. వెడతాను. మళ్లీ తిరిగివస్తాం అనుకుంటూ— నవ్వుకుంటూ, స్టేషన్‌కి చేరాడు. తల్లి మొహం ప్రయాణం పొడవునా గంభీరంగానే వుంది. ఆ పల్లెకి రాత్రప్పుడు చేరటం తల్లికి ఇష్టంలేదు. దగ్గర్లోవున్న పెద్ద స్టేషన్‌లోనే వుండిపోయేందుకు వొప్పుకుంది. ఈసారి బాబ్జీకి మనుషుల్లో మార్పు కనబడుతోంది. స్టేషన్‌లో కూలీ దగా చేశాడు. తల్లి తెచ్చుకున్న దిండు యెవరో ఎత్తుకుపోయారు. బస్సుస్టాండులో టికెట్టు యిచ్చి, అవి చెల్లవు అంటూ బస్సులో మళ్ళీ డబ్బు తీసుకోవటంతో బాబ్జీ ఘర్షణపడ్డాడు. తల్లి— 'పోనీలే వూరుకో' అంది. ఆ పల్లె దగ్గరవుతోంది. ఆ ఇంటిముందు ఆపమన్నాడు. ఆ మాట వినకుండా ఓ మైలు ముందుకి వెళ్ళి ఆపాడు. బాబ్జీ కోపాన్ని మింగి, తల్లిని నడిపించుకుంటూ, ఆ ఎండలో రామంగారి యిల్లు చేరాడు.

ముసలాయన నుదుటిమీద కుంకం బొట్టుతో ఓ మూల కునుకుతున్నాడు. బాబ్జీ ఆయనకి నమస్కారంచేసి మెలుకువ తెప్పించేడు. లేచిన ముసలాయన అదేదో పిల్లిలా సకిలించి 'వాడి వెనకే మిమ్మల్ని రమ్మన్నాడా?' అని అదిరిపోయేటట్టు అర్థంలేకుండా అరిచేడు. ఎవరివెనకో తెలియక తల్లికేసి చూస్తున్నాడు బాబ్జీ.

అసలు, ఇదివరకు తను వచ్చిన ఇల్లేనా యిది? ఇదేమిటి? ఎవరూ బైటికి వొచ్చి పలకరించరేం? ఆ ఆదరణ యేదీ? ఏమీ అర్థంగాక ఇంటికప్పుకేసి చూస్తూ నిల్చున్నాడు బాబ్జీ.

తల్లి చొరవచేసుకుని లోపలికి వెళ్ళింది ... చాలా సేపటికి రామం బయటకి వచ్చాడు. బాబ్జీకి ప్రాణం లేచివచ్చినట్టు అయింది. "నువ్వు ఎప్పుడొచ్చావు?" అని అడిగాడు.

రామంకూడా తండ్రిలాగే బుసకొట్టినట్లు మాట్లాడుతున్నాడు. అసలు తల్లియెందుకు వచ్చినట్లూ? అర్థంగాక బాబ్జీ మొహం చిట్లించుకు వూరుకున్నాడు.

లోపల తల్లికంఠం గట్టిగా వినబడుతోంది. చాలా కంఠాలు గట్టిగా అరుస్తున్నట్లు వినవస్తున్నాయి. రామంకూడా లోపలికి వెళ్ళిపోయాడు. తనని లోపలికి రమ్మనలేదు. ఎందుకు యిలా మారాడు? మళ్ళీ అర్థంకాక గోడకి చేరువగా నిల్చున్నాడు.

బడలిక, ఆకలి కలిసి అతని స్థిమితాన్ని తినేస్తున్నాయి. బాబ్జీ తల్లిని పిలిచే నెపంతో హాల్లోకి వెళ్ళాడు. తను కూర్చోపెట్టి బొమ్మ గీసిన పెద్దకళ్ళ అమ్మాయి వికృతంగా మొహం పెట్టుకు అరుస్తోంది. అక్కడవున్న మొహాల్లోని వికృతం ఆ యింటికికూడా పట్టినట్టు— ఓ మూల మురిగిపోయిన అరటిపళ్ళ కుప్పా, దానికిపట్టిన ఈగలు, చూసేందుకే వెగటుపుట్టి, మొహంతిప్పుకున్నాడు బాబ్జీ.

తల్లి మొహం వుద్రేకం వుబికినట్టు ఎరుపెక్కింది. వూపిరి బరువుగా తీస్తోంది. అసలే బ్లడ్‌ప్రెషర్ మనిషి. ఏదైనా అయితే— అన్న భావం మనస్సులో కదిలి చలించింది.

"ఎందుకమ్మా, చెప్పకుండా ప్రయాణం కట్టించావు? ఏమిటో చెప్పు.

నే కనుక్కుంటాను" అంటూ అను నయంగా తల్లిని స్థిమితపరచాలి అన్న యిదితో అడిగాడు.

ఆ పెద్దకళ్ళ అమ్మాయి అందుకుని– "అబ్బో– ఏమీ ఎరగనట్లు ఆ నాటకం చూడు. ఎంతకయినా తగుదురు. పట్నం పోకిళ్ళు ఇక్కడపోతే కాళ్ళూ చేతులూ సరీగ్గా వుండవు!"– అంటూ చేతులు తిప్పుతూ "పెందరాళే సాగనంపండి. మళ్ళా ఆ పెళ్ళివారు వస్తే అప్రతిష్ఠ. వాళ్ళు ఏమైనా అనుకోబోతారు" అని అందించింది.

ఓ జుట్టుముడి వూడిన ఆవిడ వంకర మొహాన్ని ఇంకా వంకరగా తిప్పుతూ, "అయినదానికి దేవుణ్ణి అడగమనండి. ఇప్పుడైతే ఈ పెళ్ళి జరిగితీరాల్సిందే. జరుగుతుంది కూడా! బోలెడు డబ్బుతో బంగారంలాంటి పిల్ల వస్తూంటే– ముద నష్టంపిల్ల ఈ నర్సుని కట్టుకోవడ మేమిటీ"అంటూ దవడలు నొక్కుకుంది. "–కావాలంటే ఆ రైలు చార్జీలు పారెయ్యండి" అంటూ ఆడంబరం ఒలక బోసింది.

బాబ్జీకి సగం తెలిసీ, సగం తెలియకా కోపంతో– "వాడికి పిల్లని యిచ్చేందుకా నువ్వు ఇంత ఆయాసపడి వస్తా?" అని తల్లిని గద్దించాడు.

"విధిలేక –నేను యివ్వడమేమిట్రా? వాళ్ళు యిద్దరూ చేసుకున్నట్టుగానే ఇన్నాళ్ళనుంచీ సంచరిస్తున్నారు ... ఇప్పుడేమో– ఈ నాటకం మొదలు పెట్టాడు. తను పెళ్ళి చేసుకుంటున్నాట్ట! ఇంకా దాని కిది తెలియదు. తెలిస్తే అది ఏమవుతుందో"– అంటూ దుఃఖాన్ని దిగ మింగేందుకు ప్రయత్నించింది.


బాబ్జీకి కాసేపు శరీరంలో స్పర్శా జ్ఞానం పోయినట్టయింది. ఏమీ వినబడ లేదు. మళ్ళీ నిలదొక్కుకున్నాడు. అంత లోనే తేరుకున్నాడు. రామంకోసం వెతు కుతూ గట్టిగా అరుస్తూ అతని గదిలోకి వెళ్ళి, అతన్ని బైటికి లాగి, కచ్చిగా బాది– "ఇప్పుడు చెప్పు. తప్పు ఒప్పు కొంటావా?" అని రొప్పసాగేడు. ముసలితండ్రి ఎదురుగా తప్పు తనదే నని రామం ఒప్పుకున్నాడు. అట్టేసేపు ఆ నిజాయితీ నిలవలేదు. బలగం అండగా చేరగానే బుకాయింపు మొదలెట్టి– ఆ పిల్లే తనని యిలా చేసిందంటూ– అడంగి మాటల్లోకి దిగిపోయేడు.

బాబ్జీ సింహప్పిల్లలా అరిచేడు. తల్లిని పోదాం రమ్మన్నాడు. నీతిలేని మనుషుల్ని నువ్వు అడగడం తప్పన్నాడు. గుడిసెల్లో జనం వాకిట్లోకి గుంపుల్లా చేరుతున్నారు. ముసలాయన గంగిరెద్దులా గంతులేస్తూ బాబ్జీని పొమ్మన్నాడు. బాబ్జీ తల్లి చెయ్యి పట్టుకు తొందరగా అరుగు దిగాడు.

"ఇంత నీచులకి ఈ వాతావరణాన్ని ఇచ్చాడు చూడు భగవంతుడు. వీడు మళ్ళీ అక్కడికి రాడా?" అంటూ








గంభీరంగా రామంకేసి చూస్తూ ముందుకి నడిచాడు.

బాబ్జీ తల్లి వుసూరుమంటూ జనంలో నిల్చిన ఓముసలామెకి తనగోడుచెప్పింది. "చూడండి. ఇంటికివచ్చి వచ్చి పిల్లకి ఆశలుచూపి దాన్ని వశంచేసుకున్నాడు. ఇన్నాళ్ళూ దొంగబతుకే. ఛీ నాకు తెలీదు–వీడి బుద్ధి! తండ్రిలేని పిల్లల్ని పెంచుకు వచ్చాను. ఈ నాటికి యీ పల్లె మూకచేత పడాల్సివచ్చింది. ఆ వచ్చేది సుఖపడుతుందా? చూద్దాం!" అంటూ కంటినీళ్ళని మెట్లపైకి విసిరి వెక్కుతూ వెళ్ళిపోయింది.

"ఐనా ఈ కుర్రాయనదికూడా తప్పే నెసే!" అన్న కంఠాన్ని చాలాకంఠాలు చుట్టుకుని "ఓసి – ఏటో తెలిసినట్లు మాటాడతన్నావు. పట్నవోళ్ళ పోకిళ్ళు వోరికి తెలుస్తాయి!"—"నెగోసే"— "నువ్వు నోర్మూసుకోయెసే!"—అని ఆ కంఠాన్ని మోగకుండా చేసి సందడిని సద్దుమణిగించారు.

బాబ్జీకి రోడ్డు యెక్కగానే బస్సు దొరికింది. తల్లిని బస్సు ఎక్కించి పక్కగా నిల్చుని ఆ యింటికేసి ఆవిర్లు వచ్చే కళ్ళతో చూశాడు. స్టేషన్‌లో తల్లి ఆవురుమని బాబ్జీ ఒడిలోకిఒరిగింది. అర్థమైనట్టు సర్దిచెప్పి తల్లిని ఓదార్చేడు.

ఆ ప్రశాంత వాతావరణం మచ్చుకైనా మనస్సుకి గుర్తురావడంలేదు. ఓ విధంగా పట్నాలే నయం. ఎవరి గొడవ వాళ్ళది

జీవితాన్ని తిండికోసం ఖర్చుచేసి, అలిసి, గూటికిచేరే పిట్టల్లా వాదిగి ఎవరిదారిని వాళ్ళు వెదుక్కుంటారు. ఈ పల్లెలో కావలసినంత తీరిక. అందుకే—మనుష్యులు కుయుక్తులు అల్లుకునేందుకు బోలెడు హంగులు వున్నాయి. రామంలో నిజాయితీలేదని వెనకోసారి అన్పించింది. తనే మరిచేందుకు మంచివాడిగా సృష్టించుకున్నాడు. అయినా ఆ పాపం ఈ అందరికీ అంటగట్టడం తప్పు. రామంచేసిన మోసానికి వూరిని తిట్టినందుకు బాధపడిన మనస్సూ, కళ్ళూ చెమర్చాయి.

ఈ సారి పట్నం చేరాక తల్లిసరిగ్గా లేచి తిరగటంలేదు. ఇంట్లోనే వుంటోంది. చిన్న అక్కకూడా మౌనంగా నిర్జీవంగా తిరుగుతోంది. కాలం జరిగి నెలల్ని తిప్పింది. బాబ్జీ మళ్ళీ చదవాలన్నధ్యాస కోసం ప్రయత్నిస్తున్నాడు. ఏకాగ్రత కుదరటంలేదు. అస్తమానం ఆ పల్లె జనంముందు జరిగిన అవమానం కళ్ళముందు రంగుతెరలా కదులుతోంది. 'ఇల్లా అవుతే చదవటం కష్టం'. అని తనని తనే మందలించుకున్నాడు.

ఓనాడు తల్లి మళ్ళా చీకట్లో తనకోసం ఎదురుచూస్తూ మెట్లపైన కూర్చొంది. బాబ్జీ అదుర్దాగా దగ్గరికివెళ్లాడు. ఆ కొద్ది వెలుగులో తల్లికళ్ళల్లో ఆనందం మెరిసింది.

"ఆ రామం పెళ్ళి నిల్చిపోయిందట. నిద్నీ క్షమించమంటూవు త్తరంరాశాట్ట!" అని పూరుకుంది.

"రాస్తే? నువ్వు విని ఆనందిస్తున్నావా? ఛీ. మళ్ళీ వాడు ఒప్పుకుంటే నువ్వు...నువ్వు..." అంటూ తల్లిని కుదిపి, తనలో పొంగే కోపాన్ని అణచలేక, పైకి అరవలేక, బొంగురుపోయిన కంఠంతో గొణుక్కుంటూ వెళ్ళిపోబోయాడు. తల్లి బాబ్జీని దగ్గర కూర్చోపెట్టుకు స్థిమితపడమంది.

"నాకూ ఇష్టంలేదు. అయితే ఏం చెయ్యను? దాని జీవితం దానిది. అది ఆ వుత్తరంతో మళ్ళీ సజీవంగా అయినట్టు తోస్తోంది. బిడ్డలైతే మాత్రం... ...అన్నీ నామాట మీదే జరుపుతారా? ఏమిటో—భ్రాంతి! నాకేం మూలధనం లేదుగదా — నన్ను గౌరవించేందుకూ? నేను కాదన్నాననుకో. ఇంట్లోంచి వెళ్ళిపోతుది. సంసారం ఎలా జరుగుతుంది? మీ పెద్దక్క దమ్మిడీ యివ్వదు. మీ అన్న ఆ అప్పుల్ని ఈజన్మలో తీర్చడు. అడిగితే ఉరేసుకుంటానంటాడు. మీ ఒదినషోకులకేచాలదు ఎక్కళ్ళేనిడబ్బూ. నీ కాళ్ళమీదనిల్చి నువ్వు బతుకుతున్నావు అయినా నీది విడిగావుంటే నీకు చాలుతుందా?" అంటూ దుఃఖపడింది.

"నాకు అసలు నిజాయితీ లేని మనుష్యులంటే అసహ్యం. కాని వాళ్ళమధ్యే బతికాను, బతుకుతున్నాను—నా సంతానాన్నే చూడరాదూ, నిన్ను మినహాయించి..." అని పూరుకుని, ఆయాసం తగ్గాక మళ్లీ చెప్తోంది. "పెద్దపిల్లకి మీ నాన్న వుండగా పెళ్ళిచేశాము. దానికి నిజాయితీ వుందా? వాడిని మోసంచేసి ఇక్కడికిచేరింది. దానికోసం సంసారమే ఈగంద్రగోళంకి చేర్చాల్సి వొచ్చింది. మీ నాన్న ఈ పట్నంమోజులోపడి సర్వనాశనం చేసి, నాకు సంతానాన్ని వొదిలి, విశ్రాంతిగా వెళ్లారు. నేను తినో తినకో మిమ్మల్ని ఇంతవాళ్ళని చేశాను. మీలో ఎవరైనా తృప్తిగా 'అమ్మ ఇంతచేసింది' అంటున్నారా? పైగా మీ పెద్దక్క నిన్న దెప్పింది తనకి బాగా చదువు చెప్పించి వుంటే—ఈపాటికి వేలు గడించేదాన్ని. అని వుసూరుమంది.

"మీ చిన్నక్క ఆ మధ్య 'అ డబ్బు నువ్వే యిచ్చివుంటే రామం ఇల్లా మారేవాడే కాదు' అంటూ మొహం మాడ్చుకుంది. మీ అన్న ఇంకొక్క టాక్సీ కొనివుంటే సంసారం ఎంత బాగా నడిపేవాణ్ణో—అసలు నాకు పెత్తనం ఇస్తేగా—అంటూ అరుచుకున్నాడు. మీ ఒదినకి బెనారస్ చీరలు కావాలిట. తన అందం చూసి అంతా జాలిపడ్తున్నారుట. లేకపోతే తనూ పేరున్న పెద్ద స్టార్ల లిస్టులోనే వుండేదిట. ఎప్పటికైనా దొరికి అదృష్టంపడితే బోలెడు డబ్బు మహాలక్ష్మి టెంపుల్‌కి యిస్తానని మొక్కుకుందిట. ఇవీ వాళ్ళ ఆశయాలు. నా కోసం కనీసం ఒక్కరైనా వొక్కపూట తిండిమాని యోచించారా? అందరికోసం నేను...నేను..." అంటూ వెక్కివెక్కి ఏడ్చింది. పొంగులాంటి దుఃఖం తగ్గేక "ఏళ్ళ తరబడి నిద్రాహారం పూర్తిగా విడిచి, కష్టపడి కోరికల్ని చంపుకొని, అభిమానాన్ని విడిచి, గొడ్డులా చాకిరీచేసి పెంచేను మిమ్మల్ని. నువ్వొక్కడివే పాపం. నీకు వచ్చినది కొంతైనా నా చేతికిస్తున్నావు. అదీ నీలో మరో శక్తి అవతరిస్తే బంద్ అవుతుందిలే. అదీ తెలుసు. ఇంతకాలం ఇచ్చినందుకు మెచ్చుకోకుండా వుండలేను..." అంటూ బాబ్జీ వీపు ఆప్యాయంగా తడిమింది.

"మీ పెద్దక్క కూడా పెళ్ళి చేసుకుంటుందిట. ఎవర్నో తెలుసా? ఆ పాన్‌దుకాణం సేట్ లేడూ? అతన్నిట. అతనికి కారూ, రెండు ప్లాట్లూ వున్నాయిట. బేంక్ ఎకౌంట్ బాగా వుందిట. మరింకేం కావాలని అడిగింది నన్ను. ఇదీ ఈ నాటి నాగరికుల అసలయిన అంతర్యాల ప్రతిబింబం, తెలిసిందా? డబ్బుకోసం ఆ రామం మళ్లీ పెళ్ళికి ఎగబడ్డాడు. డబ్బుకోసం మీ అక్క వయస్సు మళ్ళిన మనిషిని వరించింది. డబ్బుకోసం నీ అన్న తల్లిని అనరాని మాటలు అంటున్నాడు. నీ వదిన డబ్బూ, పేరు ప్రఖ్యాతుల కోసం ఆ సినిమాహాలు ప్రొప్రయిటర్ని, ఆరాధిస్తోంది. ఇంక నిన్ను చూడాలి...

నీ మార్గం...నేలపైన నడుస్తావో, ఆకాశం అందుకునేందుకు ప్రయత్ని స్తావో..." అంటూ రొప్పినట్టు మూల్గింది.

"ఏం మనుష్యులు!" అని పైకే అనే శాడు బాబ్జీ. అయినా తను కూడా సుధకి మాట యిచ్చాడు. ఇప్పుడు తల్లికి చెబితే డబ్బుకోసమే అనేస్తుంది. మెల్లిగా చెప్పాలి. ఏమైనా సుధా వాళ్ళూ బాగా డబ్బున్నవాళ్లే. తేవొద్దు అంటే ఒప్పు కుంటుందా? వాళ్ళ బాధలు బోలెడు చెప్పుకుంది. వాళ్ళ వాళ్లు డబ్బుతో చెడిపోయారుట. అందుకే తనని ప్రేమించిందిట. తండ్రి గోడు చెప్పుకు వలవలా అమ్మలాగే ఏడ్చింది. పాపం, మంచిపిల్ల! అమ్మ వద్దన్నా వొప్పించి, తొందరగా సుధకి సంతోషం కలిగిం చాలి. తనకి నచ్చనిది. తన యింటి మనిషుల బుద్ధులే. ఏ మాత్రం నిలకడ లేనివాళ్ళు! ఏ మాత్రం ఆత్మాభిమానం వున్నా, ఆ రామాన్ని అక్క మళ్లీ ఆహ్వానం చేసి ఆరాధించేదేనా? అమ్మ అన్నట్టు వాళ్ళ వాళ్ళ బుద్ధులు వాళ్ళవి.

అమ్మకి కూడా స్వార్థం వుంది. లేక పోతే వాళ్ళని ఎప్పుడో కోసి కారత వేసేది. అన్నింటినీ డబ్బు సర్ది సమర్థి స్తుందేమో? సుధకి ఇల్లాంటి గడుసు బుద్ధులు తెలిసినట్టు లేదు. అయినా, తన దగ్గర సింపుల్‌గా వుంటోంది.అదే చాలు.

సుధ చెల్లెలికి బోలెడు టెక్కు. అసలు ఆ నడకే కొయ్య గుర్రంలా ఎగిరినట్టు నడుస్తుంది. ఆ పిల్లని కొంచెం దూరంగా పెట్టమనాలి. ఆమె మాటల్లో వ్యంగ్యం కనబడుతుంది. అది నచ్చ లేదు తనకి.

"ఏమిటిరా ఆ ఆలోచనా?" అని తల్లి విసుక్కుంటూ ఇంటికి బయల్దే రింది.


ఎప్పుడూ ఇంతే. ఏదీ పూర్తిగా చెప్పదు. తనకేమో గ్రహించే ఓపిక లేదు. అర్థమయ్యేసరికి. కాలం తన విధుల్ని పూర్తిచేసుకు విశ్రాంతిగా ముందుకి చూస్తూ గతానికి కాలదోషం పట్టిస్తుంది.

ఇల్లు చేరారు. రైల్వే పాట్‌ఫామ్ లోలా అందరూ నిద్రపోతున్నారు గది మూల కర్టెన్ వెనక, అన్నా వదినా కీచులాడుకుంటున్నారు.

మళ్ళీ నిశ్శబ్దం మళ్ళీ మాటల వర్షం. బాబ్జీకి అర్థంకాక గోడకేసి చూస్తూ కూర్చున్నాడు. కింద టాక్సీ హారన్ ఒకటే అరుస్తోంది. కళ్ళు వొత్తు కుంటూ కిందకి తొంగిచూసి. లోపలికి పరుగెత్తింది. గుప్‌మని సెంటువాసన ఆ చిన్న గదిని ముంచేసింది.

నైలెక్స్ చీర రెపరెప లాడిస్తూ, హైహీల్ షూ పక్కకి జరక్కుండా నిటా రుగా నడుస్తూ ఎవర్నీ లక్ష్యపెట్టకుండా, వదినగారు మెట్లు దిగుతోంది. సగం మైకంలో అన్నగారు అరుస్తూ వెనక






పడ్డాడు. కారు కదిలిన చప్పుడుకి అన్న గోల ఎక్కువైంది. తల్లి వెళ్ళి పిల్చు కొచ్చింది.

మళ్లీ ఓ వారం నిశ్శబ్దంగా జరి గింది. కాని తన జీవితంలో గంద్ర గోళం మొదలయింది.

ఓ నాడు సుధ దుమారంలా ఆఫీసుకి వచ్చింది. పెళ్ళి ఎంత తొందరగా జరి గితే అంత మంచిది అంది! మరొహాళ్ళకి తెలపవొద్దు అంది.

బాబ్జీకి అర్థంకాక మొరాయించాడు.

పైగా తను చేసేది గుమాస్తాగిరీ... తనకి కోటీశ్వరుడి కూతురా? మనస్సులో ఎందుకో శంకకలిగింది. కాని జాలి పైకి వుబికి సుధమాటకి విలువ యిచ్చింది. చాలా పొద్దుపోయి వుషారుగా ఇల్లు చేరాడు. సుధతో పెళ్ళి విషయం అమ్మకి చెప్పాలి. ఎల్లా మొదలు పెట్టాలా అనుకుంటూనే నెక్‌టైని పైకీ కిందకీ జరుపుతున్నాడు.

తల్లి గోడవేపు తిరిగి పడుకుంది. బాబ్జీ దగ్గి, తల్లి దగ్గర తచ్చాడుతున్నాడు. ...తల్లి లేచి కూర్చొంది. జుట్టు విడి పోయి వుంది. కళ్లు జాపుకొంది. ఎక్కువ విచారంగా వుంటేనే అంత వికృతంగా కనబడుతుంది. 'మళ్ళీ ఏమైందా?' అన్న ఆత్రుతతో చూస్తు న్నాడు బాబ్జీ.

"మీ వొదిన మీ అన్నని వొదిలి వెళ్ళిపోయింది. అన్నింటికి డబ్బురా... డబ్బు...పోయేకాలం వొచ్చి ఈ పట్నా నికి చేర్చాను వీళ్ళని..." అంటూ

వచ్చే దుఃఖాన్ని ఆపుకొని మళ్లీ పక్క సర్దుకుని వొరిగింది.

అన్నకే నిక్షేపంలా వుంటాడు. ఎటొచ్చీ డబ్బు వుండదు. వచ్చింది అంతా మైకానికి మదుపుపెట్టి తృప్తి పడ్తాడు. అమ్మ అన్నట్లు ఆడవాళ్ళకి డబ్బుని చూస్తే మైకం వస్తుందేమో! మరి, సుధ తనని ఎందుకు...? తన స్థితి తెలుసు కదా? ఉద్యోగమైనాపెద్దది కాదే! అదే అర్థం కాలేదు. తల్లికి చేప్పేందుకు తాపత్రయపడ్డాడు. కాని ఆ స్థితిలో వినదు అనుకొని వూరుకున్నాడు.

తల్లికి చెప్పకుండా గంగిరెద్దులా కొత్త సూటు వేసుకు—సుధ వెనక వెళ్లాడు. సుధ తాలూకు కొద్దిమంది వచ్చారు. తనవేపు స్నేహితుల్ని తప్ప ఎవర్నీ తీసుకవెళ్ళలేదు. రిజిష్ట్రారు ముందు ఎందుకో చేతులు వణికేయి. సుధ మొహంలో చెల్లెలు తాలూకు గర్వం నీడలా కనబడింది. బాబ్జీ మనస్సు మళ్లా జాలితో నింపుకొని, పగలంతా స్నేహితుల్తో గడిపి, సుధని తీసుకుని చీకటి పడ్డాక తల్లి దగ్గిరకు చేరాడు,

"నువ్వా తల్లీ!" అంటూ తల్లి సుధ కేసి అదోలా చూసింది. సుధకూడా ఎరిగి నట్టే మొహం పెట్టింది. గదిలో బట్టలు చిందర వందరగా పడివున్నాయి. పెట్టెలు మూతలు తెరచుకు చూస్తున్నాయి. ఓ మూల తిన్న గిన్నెలూ, పళ్ళాలు ఎండిపోయి విడివిడిగా పడేసినట్లు పడి వున్నాయి.

సుధ ఇల్లంతటినీ వికారంగా కళ్ళు తిప్పుతూ చూస్తోంది. మెల్లిగా తల్లితో సుధని పెళ్ళిచేసుకున్నట్టు బైటపెట్టి తల్లి కాళ్ళు పట్టుకున్నాడు.

"నీ రాత ఇల్లా వుంది అన్నమాట! అంతేరా. నా సంతానం పరిపక్వమైన ఆనందాన్ని అనుభవిస్తున్నారని ఆనందిస్తున్నాను. దాన్ని కట్టుకుంటున్నట్టు మాటమాత్రమైనా చెప్పలేదేమిరా?" అని వురిమింది. మళ్లీ— "అమ్మనా, ఒహరు విన్నారు గనకనా, నువ్వు నా మాట వినేందుకు. దీని తల్లి వూరుమీద పడి సంపాదించింది. ఇహ ఇదేం చేస్తోందో! నువ్వు పక్కనవుంటే గౌరవంగా వుంటుందేమోలే!" అని సర్దుకుని వుస్సురుమంది.

బాబ్జీకి తల తిరిగినట్టు అవుతోంది. ఇంత అమాయకురాలుగాకనబడే సుధేనా, తన దగ్గిర, తన ఇంటిగుట్టు దాస్తా? ఓరి భగవంతుడా, ఏం చెయ్యటం? తనను డబ్బు చూపెట్టి వంచించలేక బేలగా నటించిందా? అసలు తననే తిట్టుకోవాలి. ఎవరైనా ఎందుకు అకారణంగా జాలిపడతారు?— అన్న సంశయమైనా తనకి రాకపోవటం తనతప్పే!

సుధ వయ్యారం ఒలకబోస్తూ "వెడదామా?" అనటంతో, మాటలు రాక యాంత్రికంగా, బయలుదేరాడు.

బొంబాయి పొలిమేరలుదాటి కారు పోతూంది. స్నేహితులు ఏవేవో వాగ్తున్నారు. సుధ నవ్వుతోంది...బాబ్జీ మనస్సులో చీకటి ఆవహించింది. ఏదో ఖాళీ, ఒంటరితనం. తప్పు చేసినట్టు మనస్సు మాటిమాటికీ చలిస్తోంది. సిటీ సందడి లేకపోయినా, ఆ బంగళాకి సిటీ యేర్పాట్లు వుండటంతో ప్రశాంతతకీ, విగ్గుపెట్టిన స్త్రీలా అసహజంగా వుంది. మూడు రోజులు వుండాలనుకున్నది, మర్నాటికే విసుగుపుట్టి తిరుగుముఖం పట్టారు స్నేహితులు. సుధ కూడా పోదామని మారాంచేసింది. స్థిరంలేని మనసులు. బొంగరం మనుషులు ... రొదలో తప్ప బతకలేరు

వచ్చేటప్పుడు, నిర్మానుష్యంగావున్న రోడ్డులో ప్రయాణం, రామంవాళ్ళవూరిని గుర్తుకి తెచ్చింది. ఏం మనుష్యులో— అంతా యింతే! అందరికీ వకటే కావాలి. తెగని దారంలా తరగని డబ్బు. దాని వెనక ఎన్నిఅయినా దాచి, గౌరవం వలసవస్తుంది. పాపం, తన తల్లి నిజాయితీని బీదతనం మింగేసింది—లోకానికి తెలియదు. పిల్లలు గుర్తించరు. వయస్సు కంటే ముందు వార్ధక్యం గుర్తించినట్టు వచ్చి కూర్చొంది.

కారు గాలిలోపడి పెద్ద కుదుపుతో ఆగింది. మరి కదలదుట. సుధ విజస్వరూపంతో ఏదో వాగేస్తుంది. తన ఆధిక్యతని చెప్పుకుంటోంది. అంతా సొంత సొదలతో. ఒకరినొకరు అర్థం చేసుకోవటం లేదు. డ్రయివరు విసురుగా రోడ్డు ఎక్కాడు. దారినిపోయే ఓ ట్రక్కు వాడిని బతిమాలి. ఎక్కిపొమ్మన్నాడు.

మళ్లీ మామూలు మనుష్యులై, ఒళ్ళు దులుపుకొని, పూర్వస్మృతులకి శలవిచ్చి యదార్ధం గుర్తుకుతెచ్చి, ఖరీదయిన సూట్ల క్రింద గుమాస్తా కళేబరాలు గుర్తుకి తెచ్చుకుని, నిజజీవితాన్ని నెమరేసుకుంటూ, నీరసంతో తెల్లవారి యివ్వాల్సినవి కళ్ళ ఎదటికి వస్తూంటే, కళ్ళ కొలకుల్లో నీళ్ళు లేక, ఎరుపెక్కిన మొహాల్ని, చేతిగుడ్డతో ఓదార్చి, అందరూ ట్రక్కులోఎక్కి నిల్చున్నారు.

అంతవరకూ అందరిబదులూ, మాటలాడిన సుధ నోరు అలిగి మూతబడింది.

సుధ ఆడంబరపు మాటలే భావిగా మారే భవిష్యత్‌ని తలచుకు భరించాలి, రాతని! బాబ్జీ భయపడ్తూ, నీరు కమ్మిన కళ్ళతో, ఆ అనుభూతి శరీరంలో ప్రాకుతూ వుంటే, మెల్లగా ట్రక్కులోకి చేరాడు.

